క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

హసన్‌పర్తి: జూన్ 1వ తేదీన మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోల్లో పొందుపరిచిన బీఆర్‌ఎస్ పార్టీ.. మాట తప్పిందని విమర్శించారు. సమ్మేళనానికి కుల బాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీసం కర్ణాకర్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, వీసం రవీందర్‌రెడ్డి, పాడి మల్లారెడ్డి, పెద్ది మల్లారెడ్డి, వీసం తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, వీసం దేవేందర్‌రెడ్డి, తోకల ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఐనవోలు : మండలంలోని జోగయ్యపల్లి, సింగారం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కల్యాణలక్ష్మి చెక్కులను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆడపిల్లల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ నిలుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్ రావు, సింగారం పీఏసీఎస్ చైర్మన్ జయపాల్ రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



హసన్‌పర్తి: అంధత్వ నివారణే లయన్స్ లక్ష్యమని క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ డైరెక్టర్ సునీల్ కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'సరిగమపదని' నేత్ర జ్యోతి కార్యక్రమాన్ని చింతగట్టుక్యాంప్ సమీపంలోని కేఎల్‌ఎన్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసెంటర్‌లో, ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ద్వారా లక్షల శస్త్ర చికిత్సలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఏడు స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అందులో ఒకటి వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కన్న పరశురాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పరిధిలోని 7జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు వివరించారు. 'నేత్ర ప్రదానం (విజన్)' విభాగంలో ఉన్నత సేవలందించిన వారిలో ఉత్తములను సన్మానించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూపశిల్పి డాక్టర్ గట్టమనేని బాబురావును ఈ ఏడాది భారత దేశం నుంచి అంతర్జాతీయ డైరెక్టర్ ఎండార్సిగా ఎంపిక చేశారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, డివిజన్ కార్పొరేటర్ సిద్ధం రాజు సహకారంతో పార్టీ బలోపేతంతోపాటు డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ డివిజన్ నూతన అధ్యక్షుడు బోరిగం నర్సింగం అన్నారు. ఈమేరకు వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌లోని ఆయన స్వగృహంలో అయనను బీఆర్‌ఎస్ నాయకులు, మైనార్టీ మహిళా సంఘాల ప్రతినిధులు ఆదివారం కలిసి సన్మానించారు. ఎండీ.తహెరా బేగం, గౌసియాబేగం, సుల్తాన పాల్గొన్నారు.

సంక్షేమానికి పాటుపడాలి

ఖిలా వరంగల్: వడ్డెర కులస్తుల సంక్షేమానికి మరింతగా పాటుపడాలని, నగరంలో ప్రత్యేక వడ్డెర కుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని వడ్డెర సంఘం నగర అధ్యక్షుడు ఓర్సు రాజు, రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు కోరారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌ను వారు ఆదివారం కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 9వేలకు పైగా వడ్డెరలు ఉన్నారని, ఈక్రమంలో జిల్లా కేంద్రంలో వడ్డెర సంఘం భవనం నిర్మించి ఇవ్వాలని కోరారు. వడ్డెరల ఎస్టీ సాధనపై జూన్‌లో వరంగల్, హనుమకొండలో వేర్వేరుగా వడ్డెరుల బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఓర్సు చిన్నఎల్లయ్య, మల్లయ్య, వల్లెపు రామస్వామి, ఓర్సు వెంకన్న, వెంకటమ్మ, శ్రీను, నాగరాజు, సంపత్, రవి, కోటి, రాజేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీపై రాజద్రోహం కేసు పెట్టాలి

కాశిబుగ్గ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించిన పార్లమెంట్ భవనం శవపేటికను పోలి ఉందని ట్వీట్ చేసిన రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ (ఆర్‌జేడీ)పై రాజద్రోహం కేసు పెట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. 142 కోట్ల మంది పవిత్రంగా భావించే పార్లమెంట్‌ను గౌరవించాల్సింది పోయి శవపేటికతో పోల్చడం ఏమిటని పేర్కొన్నారు. ఆ పార్టీపై చర్య తీసుకోవాలన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- వేసవిలో పశువులకు తాగునీరు కరువు
- పలుచోట్ల శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోని అధికారులు



గుండ్రపల్లిలో శిథిలావస్థకు చేరిన నీటి తొట్టి

నెక్కొండ : వేసవి ఎండలు మండుతుండడంతో పశువులు దాహంతో అల్లాడుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం లక్షలాది నిధులు వెచ్చించి నీటి తొట్లను నిర్మించింది. కాగా గ్రామీణ ప్రాంత రైతు కుటుంబాల పశువులకు వేసవిలో నీటి తొట్లు కరువయ్యాయి. నిర్మించిన నీటి తొట్లను నింపేందుకు ఆసక్తి చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చాలన్న ధ్యాస అధికారులకు లేకపోవడం గమనార్హం. అధికారుల ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు వేసవి కాలంలో నీరందించేందుకు నీటి తొట్లను ఏర్పాటు చేశారు. అయితే వేసవికి ముందే జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో పూర్తిస్థాయిలో పశువులకు నీటి వసతి కల్పించకపోయారు. మండలంలో 23 పశువుల నీటితొట్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మండల కేంద్రంలో వారాంత సంత(అంగడి) జరిగే ప్రదేశంలో పశువుల నీటి తొట్టి ఏర్పాటు చేసి, నీటి వసతి కల్పించంలో విఫలమయ్యారు. దీంతో సంతకు వచ్చే పశువులకు నీరు అందక మూగజీవాలు ఇబ్బంది పడుతున్నాయి.. అయినా ఎవరూ పట్టించుకోరని యాజమానులు ఆరోపిస్తున్నారు.



సంతలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

నీటి తొట్లతో ఎంతో ప్రయోజనం



పశువుల నీటి తోట్లతో ఎంతో ప్రయోజనం ఉంది. వేసవిలో మూగ జీవాలకు సరిపడా నీరు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారు. తొట్టి ఉన్న చోట నీరు నింపండం లేదు. నెక్కొండ సంతలోని తొట్టి నిరూపయోగంగా ఉంది. దీంతో మూగజీవాలు తాగునీటి కోసం తండ్లాడుతున్నాయి.

-ఎం. కమలాకర్

నీటిని నింపాలి



గ్రామంలో ఉన్న నీటి తొట్టి శిథిలావస్థకు చేరింది. అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అన్ని గ్రామాల్లో నీటి తొట్లను ఏర్పాటు కావడం లేదు. పశువులను నీటిని తాగించేందుకు చెరువు దగ్గరికి తీసుక వెళ్తున్నాం. త్వరగా మరమ్మతులు చేపట్టి నీటిని నింపాలి.

-లాక్య నర్సయ్య, గుండ్రపల్లి

మరమ్మతు చేయిస్తాం



గ్రామాల్లోని పశువుల నీటి తొట్లను వినియోగంలోకి తీసుకువస్తాం. వేసవిలో తొట్లు మూగజీవాలకు ఎంతగానో దోహదపడుతున్నాయి. మరి కొన్ని చోట్ల విద్యుత్ సౌకర్యం లేక నీటిని అందించలేక పోతున్నాం. తక్షణమే శిథిలావస్థకు చేరిన నీటి తొట్లకు మరమ్మతులు చేయిస్తాం. తొట్లో నీరు నింపేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

- జాకబ్ , ఏపీఓ, ఉపాధి హామీ

ప్రైవేట్ వాహనాల్లో తరలించాలి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : కొనుగోలు కేంద్రాల్లో కాంటా అయినా ధాన్యాన్ని తరలించేందుకు రైతులు ప్రైవేట్, సొంత వాహనాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనాలను వినియోగించుకున్న రైతులకు ఏజెన్సీల ద్వారా నగదును పొందవచ్చని తెలిపారు. కొనుగోళ్లలో అధికారులు, ఏజెన్సీలు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అధికారులకు సహకరించాలన్నారు. కొనుగోళ్లను వేగవంతం చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్ గొర్రె కవితారవి, వైస్‌ఎంపీపీ రామసహాయం ఉమారాణి, సొసైటీ డైరెక్టర్ గంగాధరి రమేష్, నాయకులు గుంటి కిషన్, రామసహాయం ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్, ఖానాపురంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శతజయంతి సందర్భంగా నివాళలర్పించారు. అశోక్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖానాపురంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్‌లు గొర్రె కవితారవి, బాషబోయిన ఐలయ్య, వైస్‌ఎంపీపీ రామసహాయం ఉమారాణి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన ధోబీ ఘాట్ల నిర్మాణం

నర్సంపేట : నర్సంపేటలోని ఎన్టీఆర్ నగర్ వద్ద రూ.2కోట్లతో అధునాతన ధోబి ఘాట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ధోబీఘాట్ల నిర్మాణానికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్‌శాఖ నిధులు మంజూరు చేసిందన్నారు. మరో రెండు రోజుల్లో పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్

నెక్కొండ : వరంగల్ ఓ సిటీలో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ ఖోఖో పోటీల్లో మండలంలోని సూరిపెల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు ఉంగ్రాతి సుజన్‌తేజ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో మూడు నవ్య, బానోత్ సీత, సింగారపు దీపిక, కె. రజిత, బాలుర విభాగంలో పరకాల హరికృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 29నుంచి 31వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని పీఈటీ కోట రాంబాబు తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ సింగారపు గీతా, ఎంపీటీసీ మాదాటి శారద, ఎస్‌ఎంసీ చైర్మన్ పరకాల వెంకటమల్లు, ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, రవీందర్, శ్రీనివాస్, జోగయ్య తదితరులు అభినందించారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు



సబ్‌మార్కెట్ యార్డులో ధాన్యం నిల్వలు

ఖానాపురం : మండలంలోని ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. 4లక్షల ధాన్యం బస్తాల కొనుగోళ్లు చేపట్టాలని పీఏసీఎస్ అధికారులు అంచనా వేసుకున్నప్పటికి కొనుగోళ్లలో ఆలస్యం జరుగుతోంది. మండల పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో భారీగా ధాన్యం నిల్వలు ఉన్నాయి. ఇప్పటి వరకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 1లక్షా 14వేల బస్తాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు. కొనుగోళ్లను మరింత వేగం చేయాలని రైతులు కోరుతున్నారు.

'మహాజన సంపర్క్'ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న శివకుమార్

గీసుకొండ : కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన విజయాలను ప్రజల్లో ప్రచారం చేయడానికి ఈ నెల 30నుంచి నెల రోజుల పాటు చేపట్టే మహాజన సంపర్క్ అభియాన్‌ను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో డివిజన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బూత్‌ల వారిగా గడప గడపకు తీసుకువెళ్లాలన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బిల్లా రమేశ్, నాయకులు నరిశెట్టి చంద్రమౌళి, గబ్బెట శ్రీనివాస్, కూనమల్ల రవి, మురళి, రాజు, వీరస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.

నియామకం

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన టి.రాజు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్–ఎంపీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎన్ రమేష్‌కుమార్‌మాదిగ ఆదివారం నియామక పత్రం అందజేశారు. రాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు



రాయపర్తి : మండలంలోని మైలారంలో శ్రీసీతారామచంద్ర లక్ష్మణ సమేత భక్తాంజనేయ, గణేష్, రుద్ర, నందీశ్వర, నవగ్రహ, పాండురంగ ఆలయ పునః ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని శిలా ధ్వజస్తంభన ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీ వేంకటేశ్వర విశ్వపూజలకు పెద్దఎత్తున భక్తజనం హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ రంగు కుమార్, సర్పంచ్ లేతాకుల సుమతియాదవ రెడ్డి, ఎంపీటీసీ గాడిపెల్లి యాకయ్య, ఉపసర్పంచ్ సారయ్య, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

31న తిమ్మంపేటలో..

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట గ్రామంలో యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 31న ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ మోడెం విద్యాసాగర్, ఆలయ అర్చకుడు రాంకీచార్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 29న గ్రామ ఆడపడుచులంతా ధ్వజస్తంభానికి జలాభిషేకం, 30న శాంతిహోమం, 31న ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అనంతరం శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

తిరుపతిలో అఖండ నామసంకీర్తన

శాయంపేట : హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదాసు భజన మండలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాడి రాజు, భజన మండలి సభ్యులు తడక రవి, కూనూరు రాజు, శ్రీధర్, మహేందర్, ప్రభాకర్ రెడ్డి, కుమారస్వామి, శంకర్, చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

రాయపర్తి : జనగామ జిల్లా జఫర్‌గఢ్ ముగ్దుంతండాకు చెందిన బానోత్ రాజన్న, కౌసల్య ఈ నెల 25న అన్నారంషరీఫ్ దర్గాకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని కొండూరు శివారు రామునిచెరువు కట్టపై రాయపర్తికి చెందిన మచ్చ భాస్కర్ ఎదురుగా ద్విచక్రవాహనంతో అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో రాజన్నకు తీవ్రగాయాలయ్యాయి. రాజన్నకూతురు అశ్విని ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బండారి రాజు వివరించారు.

విశ్రాంత ఉద్యోగులకు అవగాహన



అవగాహన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బాధ్యులు

నర్సంపేట : పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినింగ్ కోఆర్డినేటర్ పులి శ్యాం, ఎస్సై సురేష్ పెద్దలకు డిజిటల్ భద్రతా శిక్షణ మార్గదర్శకం, సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, వాటిని ఎలా ఎదుర్కోవాలి, సెల్‌ఫోన్ వినియోగం ఎక్కువగా ఉన్నందున సీనియర్ సిటిజన్స్ వాటిని అధిగమించి ఖాతాలో డబ్బులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, ఎస్సై సురేష్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎ.మోహన్‌రావు, ఎం.లక్ష్మణ్‌బాబు, కె.ఈశ్వరమూర్తి, వడ్లకొండ సాంబయ్య, కోదాటి వీరస్వామి, ఎ.సత్యనారాయణ, రాజు, శేషగిరి, సీనియర్ సిటిజన్స్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు రాజకీయంగా ఎదగాలి



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

చెన్నారావుపేట : మాదిగలు, వాటి ఉపకులాలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఎంఎంఎస్ మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి ఈదునూరి కవిత అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మాదిక రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బీఎన్ రమేష్‌కుమార్ ఆదేశం మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి ఆధ్వర్యంలో నర్సంపేట నియోజకవర్గం నెక్కొండకు చెందిన ఈదునూరి కవితను మహిళా సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ లక్ష్యసాధనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు నేరెళ్ల కుషాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇల్లందుల సుధాకర్, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సింగారపు చిరంజీవి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుమార్, సూరి భాస్కర్, రాజు, బాబు, మహేష్ తదితరులు ఉన్నారు.

జోరుగా మొరం దందా..

- చోద్యం చూస్తున్న అధికారులు



ట్రాక్టర్‌లో మొరం నింపుతున్న పొక్లెయినర్

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో మొరం దందా జోరుగా సాగుతోంది. అయినా అధికారులు పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులనే లక్ష్యంగా చేసుకుని డబ్బులు దండుకుంటున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా కొనసాగుతోందని విమర్శిస్తున్నారు. మండలంలోని జోజిపేట నారాయణ తండా, చెన్నారావుపేట, బూరుగుకుంట తండా, మగ్దుంపురం గ్రామాలతో పాటు ఆయా గ్రామాలలో ప్రతి రోజు మొరం దందా సాగుతోంది. ట్రాక్టర్ టిప్పుకు రూ.600నుంచి 800వరకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇష్టానుసారంగా మొరం కోసం పెద్ద గుంతలు తీయడంతో వర్షాకాలంలో పశువులు, మనుషులు గుంతలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు మొరం దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



వర్ధన్నపేటలో.. ఎమ్మెల్యే అరూరి రమేష్



చెన్నారావుపేట: పరామర్శిస్తున్న మాధవరెడ్డి

నర్సంపేట : నర్సంపేట పట్టణానికి చెందిన దామెరశెట్టి సోమయ్య(80) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం సోమయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఎండీ నజీర్(40) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే అరూరి రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆదివారం వేర్వేరుగా నజీర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, నాయకులు పూజారి రఘు, సిలువేరు కుమారస్వామి, తోటకూరి శ్రీధర్, మార్త సారంగపాణి, కొండేటి శ్రీధర్ వెంట నాయకులు చీటూరి రాజు, విక్కీ తదితరులు ఉన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాదురి ఆంజనేయులు, మొర్రి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మొగిళి వెంకట్‌రెడ్డి, ఎర్రిల్లి బాబు, గోపాల్‌నాయక్, సిద్దన రమేష్, రూపిక శ్రావణ్‌కుమార్, ప్రభాకర్, వీరేంద్రనాథ్, ఇంద్రసేనారెడ్డి ఉన్నారు. మండలంలోని అక్కల్‌చెడ శివారు కట్టయ్యపల్లిలోని గంగిరెద్దుల కాలనీకి చెందిన సంతోష్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కాగా సంతోష్ మృతదేహంపై మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

గౌడలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య గౌడ్

నర్సంపేట : గౌడ కులస్తులు పొదుపుతో ఆర్థికాభివృద్ధి సాధించాలని గౌడ సంక్షేమ సహకార పరపతి సంఘం డివిజన్ అధ్యక్షుడు గండి లింగయ్య గౌడ్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గౌడ సంక్షేమ పొదుపు సంఘం వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘంలోని సభ్యులు ఐక్యంగా ఉంటు సంఘం సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. గౌడల అభ్యున్నతికి ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారి కుటుంబాల్లో పిల్లల ఉన్నత చదువుకు తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తామన్నారు. సంఘంలో సభ్యులు తీసుకున్న అప్పులను కుటుంబ అవసరాలకు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. రాబోయే రోజుల్లో సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మాచర్ల ఐలమల్లు, నాయకులు వల్లాల శ్రీహరి, గిరగాని సాంబయ్య, తాళ్లపల్లి చంద్రమౌళి, సోల్తి సారయ్య, అనంతుల రమేష్, బత్తిని శ్రీనివాస్, జూలూరి హరిప్రసాద్, గంప రాజేశ్వర్, వేముల సాంబయ్య, బత్తిని శ్రీనివాస్, రామగోని సుధాకర్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ఆత్మకూరు : కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో ఆదివారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ బృందం పరిశీలించింది. అలాగే మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రజలు బీజేపీ పాలన కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. బీజేపీ కార్యకర్తలు ఈనెల 30నుంచి వచ్చే నెల30 వరకు ఇంటింటికి వెళ్లి మోదీ పాలన గురించి వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్ది మహేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, గురిజాల శ్రీరామ్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు పుల్యాల రవీందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, నాయకులు గట్టు వేణు తదితరులు పాల్గొన్నారు.